"భారత దేశంలోని ప్రతీ గ్రామం నించి, ప్రతీ ఊరు నించీ, ప్రతీ జిల్లా నించీ దేశ రాజధాని అయిన ఢిల్లీకి వెళ్ళే ఓ రోడ్డు తప్పని సరిగా ఎలా ఉంటుందో, అలాగే ప్రతీ ప్రవచనం ఆధ్యాత్మికత వైపు తీసుకువెళ్ళే విధంగా ఉండాలి. ఆధ్యాత్మికత అంటే మనిషి తన దుష్ప్రవర్తనని తగ్గించుకుని, సత్ప్రవర్తనని పెంపొందించుకునేలా చేయడం. ఏ ప్రవచనం అయినా మనిషి నడతని మార్చుకునేలా చేసేందుకు ప్రేరణని ఇచ్చేలా ఉండాలి. ఊరికే రామాయణంలోని ప్రకృతి వర్ణనలు వినడం వల్ల శ్రోతల్లో ఆ మార్పు రాదు." వివరించాడు గురువు.

## 116. బలహీనత

ఓ సన్యాసిని తన కారులో ఎయిర్‌పోర్టు నించి ఆశ్రమానికి తీసుకువెళ్తున్నాడో డ్రయివర్. అది సన్నటి రోడ్డు. కుడివైపు ఓ వాహనం ఆగి ఉంది. దాని పక్క నించి కేవలం ఓ కారు మాత్రమే వెళ్ళేంత చోటుంది. ఎదుటి నించి వచ్చే ఇంకో కారు డ్రయివర్ తన కారు ఆ కాస్త చోటులో పట్టదని గమనించి కూడా ముందుకు వచ్చాడు. దాంతో దారి లేక రెండు కార్లూ ఆగిపోయాయి.

సన్యాసి కారు డ్రయివర్ ఎదుటి కారుని కొద్దిగా వెనక్కి తియ్యమని సూచిస్తూ హెడ్‌లైట్ డిప్పర్ కొట్టాడు. వెంటనే ఎదుటి కారు డ్రయివర్ తప్పు తనదైనా 'నీ కారే వెనక్కి తీయమన్నట్లుగా' హారన్ కొట్టాడు. ఇలా రెండు మూడు సార్లు జరిగింది కాని ఎవరూ రెండోవారికి దారిని ఇవ్వలేదు. ఆ సన్యాసి మౌనంగా జరిగేది గమనిస్తున్నాడు. ఎదుటి డ్రయివర్‌కి పట్టుదల కలగడంతో తన కారు ఇంజన్‌ని ఆపేసి కూర్చున్నాడు. ఇది గమనించి సన్యాసి డ్రయివర్ కూడా తన కారు ఇంజన్‌ని ఆఫ్ చేసాడు. వెంటనే ఆ సన్యాసి తన కారు డ్రయివర్‌తో చెప్పాడు.

"మన కారుని వెనక్కి పోనించి అతనికి దారి ఇవ్వు."

"ఎందుకివ్వాలి స్వామి? మీరే చూస్తున్నారుగా? తప్పు అతనిది." డ్రయివర్ చిరాకు పడ్డాడు.

"నే చెప్పినట్లు చెయ్యి."

డ్రయివర్ అయిష్టంగానే తన కారుని వెనక్కి పోనిచ్చాడు. ముందు కారు డ్రయివర్ తన కారుని ముందుకి తెచ్చి ఈ కారు పక్కన ఆపి అరిచాడు.

"అలా దారికి రా."

వెంటనే సన్యాసి కారుదిగి ఆ డ్రయివర్ దగ్గరకి వెళ్ళి నవ్వుతూ చెప్పాడు.

"నీకు కలిగిన ఇబ్బందికి సారీ. నీకు దారి ఇచ్చిన ఆనందం మాకు దక్కింది. నిజానికి ఆ ఆనందాన్ని నీకు ఇద్దామని ఆగాం కాని నీ బలహీనతని కొద్దిగా ఆలస్యంగా గుర్తించాం."

## 117. తరంగాల తతంగం

"స్వామీ. వైబ్రేషన్స్ అని ఆధ్యాత్మిక ప్రపంచంలో ఎక్కువగా వింటూంటాను. అవి ఏమిటి?" ఓ సాధకుడు ఓ తాత్త్విక వేత్తని అడిగాడు.

"ఈ కథ విను. ఓ రాజు ఓ సారి ఓ గంధం కట్టెలు అమ్మే దుకాణం పక్క నించి వెళుతూంటే ఆ దుకాణం యజమాని మీద అకస్మాత్తుగా ఆయనకి కోపం వచ్చింది. అందుకు ఆశ్చర్యం కలిగిందాయనకి. మంత్రిని పిలిచి ఆ విషయం చెప్పాడు. మంత్రికి కూడా ఆశ్చర్యం వేసింది.

"నేనా దుకాణానికి వెళ్ళి అందుకు కారణం తెలుసుకోగలనేమో ప్రయత్నిస్తాను." మంత్రి రాజుకి చెప్పాడు.

సాయంత్రం మంత్రి వచ్చి రాజుతో చెప్పాడు.

"రాజా! నేను మధ్యాహ్నం ఆ గంధం కట్టెలమ్మే వాడి దుకాణానికి వెళ్ళి దాని యజమానిని అనేక ప్రశ్నలు వేసాను. నాకు సంగతి కొంతదాకా బోధ పడింది. అతను వ్యాపారం సరిగ్గా లేక ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాడు. మీరు ఎప్పుడు పోతారా అని ఎదురు చూస్తున్నాడు. మీరు పోతే మీ చితి కోసం చాలా గంధపు కట్టెలని అతని దుకాణం నించి కొంటాం కాబట్టి అతని ఆర్థిక పరిస్థితి బాగుపడుతుంది అన్న ఆలోచనతో దేవుడ్ని ప్రార్థిస్తున్నాడు. మీకు అతని మీద అకారణంగా ద్వేషం కలగలేదు."